క్లుప్తంగా

ఎమ్మెల్సీల పరామర్శ

అమలాపురం టౌన్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అమలాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ ఉండ్రు బుల్లియ్య కుటుంబీకులను ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు సోమవారం పరామర్శించారు. బుల్లియ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పరామర్శించినవారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ నల్లా విష్ణుమూర్తి తదితరులున్నారు.

మత్స్యకార భరోసా లబ్ధిదారుల గుర్తింపు

కాట్రేనికోన: కాట్రేనికోన మండలంలోని 675 రిజిస్టర్ బోటులకు సంబంధించి 2,928 మంది మత్స్యకార భరోసా లబ్ధిదారులను గుర్తించినట్లు మత్స్యశాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. మండలంలో బ్రహ్మ సమేధ్యం పంచాయతీలోని బలుసుతిప్ప, కొత్తపాలెం, పల్లంకుర్రు పంచాయతీ మొల్లేటిమొగ, గొల్లగరువు, కందికుప్ప, నాగపట్టణం, చిర్రయానం, పల్లం గ్రామాల్లో బోట్లను గుర్తించారు. ఆయా బోట్ల ద్వారా జీవనాధారం పొందుతున్న మత్స్యకారులకు చేపల వేట నిషేధ సమయంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేయనున్నారు.

వెంకన్న ఆలయ ఆవరణలో చలివేంద్రం ప్రారంభం



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీకాంత్ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటుచేసిన చలి వేంద్రాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ సోమవారం ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం చలి వేంద్రాన్ని ఏర్పాటుచేసిన ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవిని డాక్టర్ శ్రీకాంత్ అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస రావు, పార్టీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి విద్యాసేవలు ఎనలేనివి

యానాం: యానాం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో విశ్రాంత అధ్యాపకురాలు ఎస్.కృష్ణవేణి అందించిన విద్యాసేవలు ఎనలేనివని ప్రిన్సిపాల్ వరుగు భాస్కర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో కృష్ణవేణి మృతికి నివాళిగా ఏర్పాటుచేసిన సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కృష్ణవేణి చిత్రపటానికి పలువురు అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించి ఆమె సేవలను జ్ఞాపకం చేసుకున్నారు.


చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ శ్రీను నాయక్

అల్లవరం: నవ భారత్ యువ నిర్మాణ్ సంఘ్ అధ్యక్షులు బొంతు ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో అల్లవరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ శ్రీనునాయక్ చేతులు మీదుగా సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఎస్ఐ శ్రీను నాయక్ మాట్లాడుతూ వాహన చోదకులు, పాదచారులు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు. చలివేంద్రాన్ని ఏర్పాటుచేసిన ఎన్‌బీవైఎస్ టీం సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాగమణి, పాటి వెంకటేశ్వరరావు, కొండేటి ఈశ్వర్‌గౌడ, బొంతు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



అగ్నిప్రమాద బాధితులకు వంటసామాన్లు అందిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

అల్లవరం: బోడసకుర్రులోని అయిలావారి వీధిలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, వంట సామాన్లను సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి చేతుల మీదుగా రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, రెడ్ క్రాస్ సభ్యులు పెయ్యిల చిట్టిబాబు, శేఖర్, ప్రసాద్, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, వీఆర్‌ఓలు గెద్దాడ సత్యనారాయణ, ఉల్లీసు తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంచారంతో ప్రమాదాలు

- రోడ్లపై వదిలేస్తున్న యాజమానులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురం పట్టణ రోడ్లపై పశువుల స్వేచ్ఛా విహారం కారణంగా వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. యజమానులు తమ పశువుల్ని రోడ్లపైనే వదిలేయడంతో ఎంతోమంది క్షతగాత్రులవుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్లపైనే పడుకునే ఆవులు, ఆబోతులు చీకట్లో కనిపించక వాటిని ఢీకొని ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. మరో వైపు ఇవే ప్రమాదాల్లో పశువులు సైతం మృతి చెందుతున్న ఘటనలు సైతం చోటుచేసుకుంటున్నాయి. అమలాపురం రహదారులపై నిత్యం 500కి పైగా పశువులు సంచరిస్తున్నట్లు మున్సిపాలిటీ వర్గాల అంచనా.. అయినా మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవడానికి మాత్రం ముందుకు రాకపోవడం విమర్శలకు తావిస్తుంది.

రోజుకో రోడ్డు ప్రమాదం

వారం రోజుల క్రితం అమలాపురం ఈదరపల్లి రోడ్డులో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. పట్టణంలో ప్రస్తుతం దాదాపు 500కి పైగా ఆవులు, ఆబోతులు ఉన్నాయి. పగలంతా ఇవి రోడ్డు చెంత ఉండే చెత్త కుప్పలు, వాల్ పోస్టర్లను తింటూ ఉంటాయి. పాలథీన్ కవర్లతో ఉండే ఆహార పదార్థ వ్యర్థాలను ఆ కవర్లతో పాడేయడంతో వాటినే తినేస్తూ రోడ్లే ఆవాసాలుగా జీవిస్తున్నాయి. ఇవి పగలు రోడ్లపై సంచరిస్తూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. రాత్రి సమయాల్లో సైతం రోడ్లపైనే పడుకుని నిద్రిస్తున్నాయి. పగలు రోడ్లపై ఒక్కసారిగా అడ్డురావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతుంటే, రాత్రిళ్లు రోడ్లపై ఆవులను గమనించకుండా వాటిని ఢీకొట్టి క్షతగాత్రులవుతున్నారు. పట్టణంలో రోజూ కనీసం ఏదో చోట ఆవుల వల్ల రోడ్డు ప్రమాదం జరుగుతుంది. పశువుల యాజమానుల నిర్లక్ష్యం... సమస్య అడ్డుకట్టకు అంతంత మాత్రం చర్యలు చేపట్టే మున్సిపాలిటీ అలక్ష్యం.. పశువులను పట్టి హైదరాబాద్‌కు తరలిస్తుంటే అడ్డుకునే జంతు ప్రేమికుల అభ్యంతరం... ఈ మూడు కారణాలతో సమస్య మరింత జటిలమవుతుంది.



అమలాపురం రోడ్లపై ఆవుల సంచారం



అమలాపురంలో రాత్రిళ్లు రోడ్లపైనే ఆవుల పడక

తరలించే ప్రయత్నాన్ని అడ్డుకుంటున్నారు



ఆవులను బంధించి హైదరాబాద్‌లోని పేరు మోసిన గోశాలలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నాం. అయితే అలా తరలిస్తున్నప్పుడు పట్టణంలో కొన్ని సంస్థలకు చెందిన జంతు ప్రేమికులు అడ్డుకుంటున్నారు. ఆవులకు సంబంధించి కొందరి యాజమానులను గుర్తించి వారిని ఎన్నిసార్లు పిలిచి వార్నింగ్‌లు, కౌన్సిలింగ్‌లు ఇచ్చినా మార్పు రావడం లేదు. అందరూ సహకరిస్తే ఆవుల తరలింపు సజావుగా సాగుతుంది.

– కొత్త అప్పలరాజు, డీఈఈ, అమలాపురం మున్సిపాలిటీ

మా వాళ్లు గాయపడ్డారు



రహదారికి అడ్డంగా వచ్చిన ఆవుల వల్ల మా పెదనాన్నతో పాటు నా స్నేహితుడు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. వారిద్దరూ ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చాక దాదాపు 6 నెలల పాటు బెడ్ రెస్ట్‌లో ఉండాల్సి వచ్చింది. వైద్యానికి రూ.లక్షకు మించి ఖర్చులయ్యాయి. ఆవులను తరలించాలని మున్సిపాలిటీకి ఫిర్యాదు కూడా చేశాం.

– కుడుపూడి శాంతి భూషణ్, మెంబర్, ఆజాద్ ఫౌండేషన్

ముఖ్యమంత్రి జగన్‌కే ప్రజలందరి ఓటు

- ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- కాట్రేనికోన మండలంలో గడపగడపకూ మన ప్రభుత్వం

కాట్రేనికోన: కుల,మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలందరి ఓటు అని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లు అన్నారు. సోమవారం వేట్లపాలెం, జిల్లేళవారిపేట, బూలవారిపేట గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎంపీ, ఎమ్మెల్యేలిద్దరూ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు కలుగుతున్న లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగనన్న ప్రభుత్వంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, సంక్షేమ పథకాలను మహిళా లబ్ధిదారుల పేర్లతోనే మంజూరు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూడలేక ప్రతిపక్ష పార్టీలు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కాట్రేనికోన పంచాయతీలో ప్రజలకు రక్షిత మంచి నీటిని అందించేందుకు రూ.9 కోట్లు ఖర్చు చేశామన్నారు. సత్తెమ్మచెట్టు, జిల్లేళవారి పేట, రామస్వామితోట గ్రామాల్లో వాటర్ ట్యాంకులు నిర్మించి రక్షిత మంచి నీటిని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాట్రేనికోన సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, హితకారిణి సమాజం చైర్మన్ కాశి మునికుమారి, నాయకులు సంసాని నాగేశ్వరరావు, సానబోయిన నాగేశ్వరరావు, కొప్పాడి బాలకృష్ణ, నల్లా నరసింహమూర్తి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నల్లా బేబి జానకి, జగడం బాలయ్య, పాలెపు ధర్మారావు, వాసంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వేట్లపాలెం గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

సెంట్రలైజ్డ్ పోర్టల్‌లో జనన, మరణ రిజిస్ట్రేషన్‌లు

యానాం: యానాంలో జనన, మరణ రిజిస్ట్రేషన్‌లను ఇకపై కొత్తగా ప్రారంభించిన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్(సీఆర్ఎస్) ద్వారా చేయనున్నట్లు పుదుచ్చేరి జనాభా లెక్కల అసిస్టెంట్ డైరెక్టర్ జయభారతిరాజు తెలిపారు. సోమవారం స్థానిక మినీ సివిల్ స్టేషన్‌లో సీఆర్ఎస్ సిస్టమ్ పద్ధతి ద్వారా రిజిస్ట్రేషన్‌లపై పుదుచ్చేరి నుంచి వచ్చిన అధికారులు మున్సిపల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్ఎస్ నేషనల్ పాపులేషన్ రిజిస్టర్‌కు లింకై ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ వివరాలన్నీ డిజిటలైజేషన్ అవుతాయని చెప్పారు. ప్రజలు తమ జనన, మరణ ధృవీకరణ రిజిస్ట్రేషన్‌లను 21 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ యూనిట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామకృష్ణ, డీలింగ్ అసిస్టెంట్ తాతాజీ, ఆపరేటర్ సంగాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జనన, మరణ రిజిస్ట్రేషన్‌లపై అవగాహన కల్పిస్తున్న పుదుచ్చేరి జనాభా లెక్కల అధికారులు

చలివేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

అమలాపురం రూరల్: వెల్లి సావిత్రి మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ, తులిప్స్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో అమలాపురం అంబేడ్కర్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ప్రారంభించారు. దాతలు ప్రజల దాహం తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు దంపతులచే స్పందన కార్యక్రమంలో పాల్గొనే అర్జీదారుల కోసం చలివేంద్రం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో డీఆర్వో సత్తిబాబు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ అందిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

మౌంట్ అబు ఓం శాంతి ప్రతినిధులకు సత్కారాలు

అమలాపురం టౌన్: రాజస్థాన్ రాష్ట్రం మౌంట్ అబు ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయం నుంచి వచ్చిన ధ్యాన నిపుణుడు బీకే సూరజ్‌బాయ్ తదితరులను స్థానిక ఓం శాంతి ధ్యాన మందిరంలో ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు సోమవారం ఘనంగా సత్కరించారు. చాంబర్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అందరూ ధ్యానం వైపు అడుగులేస్తే జీవితం ఆనందమయమవుతుందని సూరజ్ బాయ్ ఉద్బోధించారు. కార్యక్రమంలో స్థానిక బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, చాంబర్ కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, యర్రమిల్లి విశ్వేశ్వరరావు, చింతలపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



మౌంట్ అబు ధ్యాన నిపుణుడు సూరజ్‌బాయ్‌ను సత్కరిస్తున్న చాంబర్ ప్రతినిధులు

ముదురుతున్న వివాదం

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో శ్మశాన వాటిక ఆక్రమణ వివాదం రోజురోజుకి ముదురుతుంది. ఎస్.కొత్తపల్లివాసులు శ్మశానవాటికగా ఉపయోగించే స్థలం కోలా నరసింహమూర్తి అనే రైతు ఆక్రమించాడంటూ గ్రామస్తులు ధర్నాకు దిగడం, జేసీ ధ్యానచంద్ర వాస్తవం నిగ్గు తేలుస్తామంటూ హామీ ఇవ్వడం తెలిసిందే. అయితే తన చెరువు వద్ద పనిచేయకుండా మనుషుల్ని వెలి వేశారంటూ రైతు నరసింహమూర్తి గతవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు రైతు పని అడ్డుపడితే చర్యలు తప్పవని గ్రామస్తుల్ని హెచ్చరించారు. సోమవారం పోలీసు బలగంతో చెరువులో చేపల వేటకు ఇతర ప్రాంతాల నుంచి మత్స్యకారుల్ని తీసుకొచ్చారు. దీంతో స్థలం ఎవరిదో తేలకుండా అక్కడ పనులు చేపడితే ఆత్మహత్య చేసుకుంటామంటూ గ్రామస్తులు పెట్రోల్ బాటిళ్లతో ఆందోళన చేపట్టారు. ఇరువర్గాలతో ఆర్డీవో వసంతరాయుడు ఫోన్‌లో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని తెలపడంతో ఆందోళన విరమించారు. పెట్రోల్ బాటిళ్లతో ఆందోళనకు దిగిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తుక్కేశ్వరరావుకు నివాళులు

ఉప్పలగుప్తం: స్థానిక బాలయోగి పార్కు వద్ద మాదిగల పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో దగాపడ్డ చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈతకోట తుక్కేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తొత్తరమూడి బాబులు, చీట్ల విద్యాసాగర్, పలివెల రాంబాబు, వంగలపూడి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బైర్రాజు ఫౌండేషన్ వైద్యసేవలు

ఐ పోలవరం: బైర్రాజు ఫౌండేషన్ వారోత్సవాల్లో భాగంగా కొమరగిరిలోని రామారావు పేటలో ఉచిత వైద్య సేవలు అందించారు. బైర్రాజు ఫౌండేషన్ హాస్పటల్ వైద్యులు సుమారు 120 మందికి షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు మందులను అందజేసినట్లు కోఆర్డినేటర్ గంగరాజు తెలిపారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రొయ్యల చెరువుల పరిశీలన

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ఉప్పు నీటి రొయ్యల సేద్యం చేస్తున్న చెరువులను సోమవారం ఆర్‌ఏఓ మునిస్వామి పరిశీలించారు. ముఖ్యంగా మత్స్యశాఖ, కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ రిజిస్ట్రేషన్‌ను చేయనున్న నేపథ్యంలో రొయ్యల చెరువులను పరిశీలించి ఎన్ని హెక్టార్లలో సేద్యం జరుగుతుంది, మౌలిక సదుపాయాలు తదితర విషయాలు తెలుసుకున్నారని మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

తాళ్లరేవు: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నాడు–నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ రాయుడు సునీత ఆదేశించారు. సోమవారం పటవల పంచాయతీ పరిధిలోని కొత్తూరు, పటవల ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో జరుగుతున్న పనులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కోడిగుడ్లు నాణ్యతగా లేకపోవడాన్ని గుర్తించి ప్రశ్నించారు. విద్యార్థులకు ఎలాంటి లోటు లేకుండా చూడాలన్నారు. ఆమె వెంట రాయుడు గంగాధర్, కొప్పిశెట్టి వెంకట్ తదితరులు ఉన్నారు.

జ్యోతిరావ్‌పూలే, అంబేడ్కర్ జయంతోత్సవాలు

ఐ.పోలవరం: ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పిలుపు మేరకు సోమవారం మహాత్మా జ్యోతిరావ్ పూలే, అంబేడ్కర్ జయంతోత్సవాలను ఐ.పోలవరం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వీధి సూరిబాబు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా, అంబేడ్కర్ విగ్రహానికి పాఠశాల చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు నివాళులర్పించారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు

- మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్
- ఇమ్మిడివరప్పాడులో గడప గడపకూ..

అమలాపురం రూరల్: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. ఇమ్మిడివరప్పాడులో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శ్రీకాంత్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని మధ్యవర్తులతో సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే అందిస్తున్నారని చెప్పారు. నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, సర్పంచ్ రేలంగి దుర్గారావు, ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, ఎంపీడీవో కాశీ విజయ ప్రసాద్, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి తదితరులు పాల్గొన్నారు.



ఇమ్మిడివరప్పాడులో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన



సుంకరపాలెంలో ప్రభుత్వ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత



బోడసకుర్రులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం

తాళ్లరేవు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. సోమవారం ఆమె స్థానిక నాయకులతో కలిసి పటవల, సుంకరపాలెం, తాళ్లరేవు తదితర పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ తీరుపై ప్రశ్నించి వారి అనుమతితో ఇంటింటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనితీరుపై ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమాల్లో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టేకుమూడి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, నాయకులు కొప్పిశెట్టి వెంకట్, కాశి లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

బోడసకుర్రులో జగనన్నే మా భవిష్యత్

అల్లవరం: గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో బోడసకుర్రులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఎంపీపీ ఇళ్ల శేష గిరిరావు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గ్రామకమిటీ అధ్యక్షుడు మట్టపర్తి షణ్ముఖరావు, పార్టీ నాయకులు అంబటి శ్రీను, అడపా శ్రీను, బొంతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం 14వ వార్డులో సోమవారం జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ప్రజలు మా సంక్షేమ నమ్మకం జగనే అంటూ ప్రజా మద్దతు పుస్తకంలో తమ అభిప్రాయాలు తెలిపారు. వార్డు కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, కౌన్సిలర్లు దొంగ నాగ సుధారాణి, యన్నాబత్తుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం

అమలాపురం టౌన్: అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన అవసరమని అమలాపురం అగ్నిమాపక దళాధికారి కేవీ మురళి కొండబాబు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక సర్ సీవీ రామన్ స్కూలులో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాదం అనివార్యమైతే ప్రాథమిక జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు. స్కూలు ప్రాంగణంలో అగ్నిమాపక దళం యంత్రాలు, పరికరాలు ఉపయోగించి ప్రయోగాత్మకంగా అవి పనిచేసే విధానాలను ప్రదర్శించారు. అనంతరం స్థానిక శారద స్కూలులో ప్రమాద నివారణ చర్యలపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. అగ్నిమాపక దళం లీడింగ్ ఫైర్‌మెన్ ఎం.బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

యానాం: సమాజంలో ప్రతిఒక్కరూ అగ్ని ప్రమాదాల నివారణ, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన ఏర్పరచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని స్టేషన్ ఇన్‌చార్జి ఎల్.గంగరాజు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక యానాం అగ్నిమాపక స్టేషన్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ స్టవ్‌ను ఎల్లప్పుడూ సిలెండర్ కన్నా ఎత్తులో ఉంచాలని, వంటగదిలో గాలి, వెలుతురు ఉండేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ నాగేశ్వరరావు, ఫైర్‌మెన్ డ్రైవర్ కిరణ్‌కుమార్, సత్యనారాయణ, ప్రకాశరావు, కుటుంబరావు, గిరి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక దళాధికారులు

పబ్లిక్ టాయిలెట్స్ ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక 24వ వార్డులో గడియారం స్తంభం సెంటరు సమీపంలో బీవోటీ విధానంలో నిర్మించిన పే అండ్ యూజ్ పబ్లిక్ టాయిలెట్స్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్)లో భాగంగా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిర్మించిన ఈ మోడ్రన్ టాయిలెట్స్‌ను అమలాపురానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, వార్డు కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, గొవ్వాల రాజేష్, వాసర్ల లక్ష్మి, ఏడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మోడ్రన్ టాయిలెట్స్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి తదితరులు

విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

యానాం: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకుని దాని సాధనకు నిరంతరం కృషి చేయాలని అమలాపురం జోనల్ ఏజీఎం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నారాయణ స్కూల్‌లో జరిగిన గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కోఆర్డినేటర్స్ లక్ష్మీప్రియ, రామతులసి, ఎస్.సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాళ్లరేవు: తాళ్లరేవు బాప్టిస్టు చర్చిలో క్రీం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ తెలిపారు. పిఠాపురం సీఎంసీ హాస్పటల్ నేత్ర వైద్య నిపుణులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ రోగులను పరీక్షిస్తారని చెప్పారు. తాళ్లరేవు పరిసర ప్రాంత ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

అమలాపురం రూరల్: అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, చిల్లా జగదీశ్వరి అన్నారు. పేరూరు అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ 132వ జయంతి ఉత్సవ సభ అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు.

బాబ్జి కుటుంబీకులకు పరామర్శ

అమలాపురం రూరల్: మాజీ ఎంపీ నల్లా రెడ్డినాయుడు కుమారుడు నల్లా అప్పారావు (బాబ్జి) కుటుంబీకులను మాజీ ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, తోట సుబ్బారావు నాయుడు, నిమ్మకాయల జగ్గయ్య నాయుడు, పచ్చిగోళ్ల నర్సిబాబు తదితరులు సోమవారం పరామర్శించారు. బాబ్జి ఫోటోకు పూలు జల్లి నివాళులర్పించారు.

ట్రక్కుతో పాటు ట్రాక్టరు చోరీ

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన వాసంశెట్టి శ్రీనివాస్‌కు చెందిన ట్రాక్టరు ట్రక్కుతో పాటు ఆదివారం రాత్రి చోరీకి గురైంది. వేసవి కాలంలో పనులు ఉంటాయనే ఉద్దేశంతో ట్రాక్టరును వాసంశెట్టి శ్రీనివాస్ మూడు నెలల క్రితం కొనుగోలు చేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.